# కృష్ణా వెనుక జలాల్లో సాయంత్రం 5 గంటల వరకే అనుమతి

చందంపేట, జూలై 24 : నేరేడుగొమ్ము మండలం వైజాక్ కాలనీ సమీపంలోని కృష్ణా వెనుక జలాల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే పర్యాటకులకు అనుమతి ఉందని నేరేడుగొమ్ము ఎస్ఐ సతీశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కృష్ణా వెనుక జలాల్లో స్నానానికి వెళ్లి ఐదుగురు మృత్యువాతపడిన నేపథ్యంలో పర్యాటకులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కృష్ణా వెనుక జలాల్లో ఈతకు వెళ్లడం, స్నానం చేయకూడదని తెలిపారు. సాయంత్రం 5 గంటల తర్వాత కృష్ణా వెనుక జలాల్లో సంచరిస్తే పోలీసు శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరపడవలు నడిపే వారు పోలీసుల నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో చట్టరిత్యా చర్యలకు బాధ్యులవుతారని పేర్కొన్నారు. కృష్ణా వెనుక జలాల్లో అనుమతులు అతిక్రమించి సంచరిస్తే 8712670224 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, గురువారం 25 జూలై 2024 | NALGONDA

# నేటి నుంచి మూసీ కాల్వలకు నీటి విడుదల



కేతేపల్లి, జూలై 24 : వానకాలం సీజన్‌లో పంటల సాగు కోసం మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు గురువారం నుంచి నీటిని విడుదల చేయనున్నారు. నాలుగు తడులు విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మొదటి విడుతగా 25 రోజులపాటు నీటిని విడుదల చేయనున్నట్లు డీఈఈ చంద్రశేఖర్ తెలిపారు. ప్రాజెక్టు కుడి కాల్వకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 641.60 అడుగులు (3.59 టీఎంసీలు) ఉన్నది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 1,467 క్యూసెక్కులు వస్తున్నది. 68.74 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో దిగువకు వెళ్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండకపోయినప్పటికీ ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా, రైతుల ప్రయోజనం కోసం ముందుగానే నీటిని వదులుతున్నారు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

# అభిమాన నాయకుడికి శుభాకాంక్షల వెల్లువ

## ఘనంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేకులు కట్ చేసిన నాయకులు, కార్యకర్తలు**

**ఆస్పత్రులు, అనాథ ఆశ్రమాల్లో పండ్ల పంపిణీ.. పలు చోట్ల అన్నదానాలు**



హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



నల్లగొండ బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, జిల్లా నాయకులు

సూర్యాపేట(నమస్తే తెలంగాణ)/నల్లగొండ, జూలై 24 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని కేకులు కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. పలు ఆస్పత్రులు, అనాథాశ్రమాల్లో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అన్నదానాలు నిర్వహించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేయగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నకిరేకల్, దేవరకొండలో మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, రమావత్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పాల్గొని భారీ కేక్ కట్ చేశారు. అనంతరం సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలు చోట్ల అన్నదానాలు చేపట్టారు. కోదాడలో జరిగిన జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని కేక్‌కట్ చేశారు. తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.



కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సూర్యాపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, బీఆర్ఎస్ నాయకులు

# ప్రొటెం స్పీకర్‌గా బాలూనాయక్



చందంపేట, జూలై 24 : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ బుధవారం జరిగిన అసెంబ్లీ శాసన సభ సమావేశాల్లో ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించారు. లంబాడ సామాజిక వర్గానికి చెందిన బాలూనాయక్ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# రేపటి నుంచి మున్సిపాలిటీల్లో ఇంటింటి జ్వర సర్వే నిర్వహించాలి

- పారిశుధ్యంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి
- మున్సిపల్ కమిషనర్ల సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతన్న కలెక్టర్ సి. నారాయణరెడ్డి

నీలగిరి, జూలై 24 : ఈ నెల 26 నుంచి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఇంటింటి జ్వర సర్వే నిర్వహించాలని నల్లగొండ కలెక్టర్ సి.నారాయణరెడ్డి మున్సిపల్, వైద్యారోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లతో బుధవారం వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా సిబ్బంది, వైద్యారోగ్యశాఖ సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి వారికి గురువారం శిక్షణ ఇచ్చి శుక్రవారం నుంచి ఇంటింటి జ్వర సర్వేను చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలని, ఎవరికైనా జ్వరం ఉన్నట్లు గుర్తిస్తే చికిత్స అందించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు.

తాగునీరు కలుషితం కాకుండా లీకేజీలను గుర్తించి అరికట్టాలని, ట్రాన్స్‌ఫార్మర్లకు తక్షణమే కంచెలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇండ్లపైన దగ్గరగా వెళ్లే విద్యుత్ వైర్ల నుంచి ప్రమాదం జరుగకుండా పైపులాంటివి తొడించాలన్నారు. వనమహోత్సవంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. సమావేశంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఎంహెచ్ఓ కళ్యాణచక్రవర్తి, మున్సిపల్ కమిషనర్లు, డీపీఎం మేనేజర్లు పాల్గొన్నారు.

# తక్షణమే స్పందిస్తూ బాధితులకు న్యాయం చేయాలి

- నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నందికొండ విజయపురి పోలీస్‌స్టేషన్‌లో మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో బాధితుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నందికొండ, జూలై 24 : ప్రజా ఫిర్యాదులో జాప్యం చేయకుండా తక్షణమే స్పందిస్తూ బాధితులకు తగిన న్యాయం జరిగేలా పోలీసులు పని చేయాలని నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. నందికొండ హిల్‌కాలనీ విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రూ.1.50 కోట్లు నష్టపోయిన పోస్టల్ బాధితులు, ఫ్యామిలీ గొడవలు, ల్యాండ్ సమస్యలు, ఫారెస్ట్ భూములు తమకు కేటాయించాలని, తిరుమలగిరి (సాగర్ ) మండల పరిధిలోని చింతలపాలెం, నెల్లికల్, తునికనూతల పరిధిలోని 20 గ్రామాలను నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్‌లో కలుపాలని వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ పరిశీలించారు. సంబంధిత శాఖ అధికారులకు సత్వరమే న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వెంటనే సమస్యలను పరిష్కరించాలని, దొంగతనాలు జరుగకుండా సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. నాగార్జునసాగర్ రెండు తెలుగు రాష్ట్రాలకు సరిహద్దు కావడంతో అనునిత్యం నిఘా ఏర్పాటు చేసి తనిఖీలను నిర్వహిచాలని, గంజాయి రవాణా అరికట్టడానికి సమర్థంతంగా పని చేయాలని తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి రాలేక పోతున్నారని, ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను పరిష్కరించడానికి మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం హిల్‌కాలనీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై యువతకు మ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు నాగార్జునసాగర్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, పోలీస్ స్టేషన్ స్థితిగతులను ఎస్పీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్‌గౌడ్ పాల్గొన్నారు.

# రుణమాఫీపై నోరు విప్పరే..



## ఏ సమాచారమూ ఇవ్వని అధికారులు

- అర్హులు, లబ్ధిదారుల వివరాలు లేవంటూ ప్రశ్నల దాటవేత
- ఒకరికి మీదికి ఒకరు తోసేస్తున్న బ్యాంకర్లు, వ్యవసాయాధికారులు
- తమకు రుణమాఫీ ఎందుకు అవ్వలేదో చెప్పాలంటున్న బాధితులు



నల్లగొండలోని ఓ బ్యాంక్‌లో ఖాతాలను చెక్ చేసుకుంటున్న రైతులు

సూర్యాపేట, జూలై 24 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల ముందు రూ.2లక్షల రుణమాఫీకి హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కొర్రీల మీద కొర్రీలు పెడుతూ అన్నదాతలను అవస్థల పాల్జేస్తున్నది. రుణమాఫీ అవ్వని రైతులు తమకు ఎందుకు ప్రభుత్వం లబ్ధి చేకూరలేదో తెలియక ఆగమాగం అవుతున్నారు. నిత్యం వ్యవసాయాధికారుల దగ్గరికి, బ్యాంకుల చుట్టూ విసిగి వేసారుతున్నారు. ఏ అధికారిని అడిగినా సరైన సమాధానం రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తొలి విడుత లక్షలోపు మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి జిల్లాలో 56,217 మంది రైతులకు 282.98 కోట్లు మాఫీ అయినట్లు చెప్తున్నప్పటికీ ఆస్థాయిలో మాఫీ అయ్యిందా, లేదా అన్నది కూడా ప్రశ్నార్థకంగా మారింది. అసలు లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులు ఎంతమంది ఉన్నారు, ఎంతమందికి మాఫీ అయింది అనే సమాచారం ఎక్కడా లభించడం లేదు. రైతులతో పాటు మీడియా ప్రతినిధులు అడిగినా బ్యాంకర్లు గానీ, వ్యవసాయ శాఖ అధికారులు గానీ సమాధానం ఇవ్వడం లేదు. బ్యాంకర్లు తమకు తమకు సంబంధం లేదు.. వ్యవసాయ శాఖ వద్దే ఆ వివరాలు ఉంటాయని చెప్తుండగా, వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకర్ల మీదకి నెట్టివేస్తున్నారు. రైతాంగానికి సంబంధించిన రుణమాఫీ విషయంలో ఇంత గుట్టుగా ఉండాల్సిన అవసరమేంటో అధికారులు, ప్రభుత్వానికే తెలియాలి. కేసీఆర్ సర్కారులో నాడు లక్షలోపు రుణమాఫీ చేయగా సూర్యాపే జిల్లాలో మొత్తం 1,75,000 మంది రైతులు 1,300 కోట్ల రూపాయల రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు. వారిలో దాదాపు లక్ష మంది రైతులకు రుణాలు మాఫీ చేయగా, ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షలు మాఫీ చేయాల్సి ఉండగా.. తొలి విడుతగా లక్ష లోపు చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా, వారం క్రితం ఈ ప్రక్రియ మొదలు కాగా, జిల్లాలో 2.53 లక్షల మంది రైతులు సుమారు 3,350 కోట్ల రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు. ఇందులో 2 లక్షల రూపాయల లోపు తీసుకున్న వారే 90 శాతం మంది ఉన్నట్లు తెలుస్తున్నది. 1.60 లక్షలకు పైన రుణాలు తీసుకోవాలంటే నిబంధనల మేరకు షురిటీలు ఇవ్వాల్సి ఉండడంతోపాటు వడ్డీ రేటు కూడా మారుతుందని, అందుకే రెండు లక్షలు దాటి రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య వేళ్ల మీద లెక్కబెట్టేంతే ఉంటుందని ఓ బ్యాంకు అధికారి తెలిపారు. ఈ లెక్కన జిల్లాలో సుమారు 2.35లక్షల మంది రైతులు రెండు లక్షలలోపు రుణాలు తీసుకొని ఉంటారని, అంతా కలిపి 3వేల కోట్ల వరకు ఉండొచ్చన్న అంచనాగా చెప్పుకొచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష లోపు రుణాలు మాఫీ చేసిన సమయంలో 1.75 లక్షల మంది రైతులకు 1,300 కోట్లు ఉండగా, ఇప్పుడు కూడా అంతే మొత్తంలో రుణాలు ఉంటాయన్నది తెలిసిన సమాచారం. తీరా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన లక్షలోపు రుణమాఫీలో సూర్యాపేట జిల్లాలో కేవలం 56,217 మంది రైతులకు 282.98 కోట్లు మాఫీ చేయడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఎన్నికల ముందు ఎవరైనా రుణాలు తీసుకోకుంటే వెంటనే బ్యాంకులకు వెళ్లి రెండు లక్షలు తీసుకోండి.. మేం వచ్చి మాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ నేడు అనేక కొర్రీలు పెట్టడం పట్ల రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తీసుకున్న ప్రతి రైతుకూ బ్యాంకులో అకౌంట్ ఉంది. ఆధార్ కార్డులు అనుసంధానం అయ్యింది. అయినా ఏదో ఒక కొర్రీ పెట్టి రుణమాఫీ చేయడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ కాని వేలాది మంది రైతు ఐదు రోజులుగా బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రుణమాఫీపై కచ్చితమైన సమాచారాన్ని బహిర్గతం చేసి, మాఫీ కాని రైతులకు సరైన కారణం చెప్పాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### ఏకకాలంలో రుణమాఫీ ఎటుపోయింది



ఎన్నికలకు ముందు రైతులకు ఏకకాలంలో రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదు. ఏకకాలంలో రుణమాఫీ ఎటుపోయిందో రేవంత్‌రెడ్డి సర్కారు రైతులకు సమాధానం చెప్పాలి. కేవలం ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ నాటకాలు ఆడింది. రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు. ఇప్పటికైనా కండ్లు తెరిచి వెంటనే రూ.2లక్షలు రుణమాఫీ చేయాలి.

-నర్రపరమేశ్, రైతు, సోలిపేట

# మోదీ బడ్జెట్‌లో కుర్చీ కాపాడుకోవటమే కనిపించింది

## దేశాన్ని కాదని మూడు రాష్ట్రాలకే నిధులివ్వడం దారుణం

- విభజన చట్టం ఏపీకి తప్ప తెలంగాణ రాష్ట్రానికి వర్తించదా
- కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారో అర్థం కావట్లేదు
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నల్లగొండ అధ్యక్షుడు రవీంద్రకుమార్

నల్లగొండ, జూలై 24 : పార్లమెంట్‌లో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రధాని మోదీ కుర్చీ కాపాడుకోవడమే కనిపించిందని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆయన బుధవారం మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశాన్ని కాదని ఏపీ, బిహార్, ఒడిశా రాష్ట్రాలకే బడ్జెట్‌లో పెద్దపీట వేశారన్నారు. విభజన చట్టం ప్రకారం ఏపీకి నిధులు ఇస్తున్నామంటున్న మోదీ సర్కార్ అదే విభజన చట్టం తెలంగాణ రాష్ట్రానికి వర్తించదా అని ప్రశ్నించారు. ఏపీ రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లతోపాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, రాయలసీమ, ప్రకాశం లాంటి ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇస్తామన్న కేంద్రానికి తెలంగాణలోని పాలమూరు ప్రాజెక్టు గుర్తుకు రాలేదా అని తెలిపారు. ఏనాడైనా కాళేశ్వరం గురించి పట్టించుకోని బీజేపీ ఇప్పటికీ కృష్ణా జలాలపై వాటాలు తేల్చలేదని దుయ్యబట్టారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు ఎందుకు కేటాయించలేదని, కొత్త ప్రాజెక్టులపై ఎందుకు కనికరించలేదని ప్రశ్నించారు. పదేండ్ల కాలంలో కేంద్రం తెలంగాణపై కక్షగట్టి నిధులు ఇవ్వలేదని, ఈ సారి రాష్ట్రంలో ఎనిమిది ఎంపీల చొప్పున కాంగ్రెస్‌కు, బీజేపీకి ఇస్తే ఒక్క రూపాయి కూడా తేలేకపోయరాని విమర్శించారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఏం చేస్తున్నారన్నారు. ప్రాంతీయ పార్టీల వల్లనే ఏపీకి, బిహార్‌కు నిధుల వరద పారిందని, మాజీ సీఎం కేసీఆర్ కోరినట్లు తెలంగాణ ప్రజలు 10–12 ఎంపీ సీట్లు బీఆర్ఎస్‌కు ఇస్తే మన రాష్ట్రానికి కూడా ఎన్నో నిధులు వచ్చేవని చెప్పారు. అయినా మోదీ సర్కారును వదిలేది లేదని, ఇక్కడ ఎంపీలను తరుముతూ కేసీఆర్ నాయకత్వంలో కేంద్రాన్ని ఎండగడుతామని హెచ్చరించారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించేలా బోధించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్




ఇమాంపేట కస్తూర్బా పాఠశాలలో కూరగాయలు పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

సూర్యాపేట రూరల్, జూలై 31 : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యతోపాటు అన్ని రంగాల్లో నైపుణ్యత సాధించే విధంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అన్నారు. సూర్యాపేట మండల పరిధిలోని ఇమాంపేట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైనింగ్ ఏరియా, తరగతి గదులను పరిశీలించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులతో మాట్లాడి బోధన, అదనపు క్లాసులు, మెనూ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయురాలు దుర్గాభవాని, ఉపాధ్యాయులు ఉన్నారు.

# ఆర్టీసీలో ప్రమాద రహిత వారోత్సవాలు ప్రారంభం




మాట్లాడుతున్న ఆర్ఎం రాజశేఖర్

నల్లగొండ సిటీ, జూలై 24 :నల్లగొండ డిపోలో మేనేజర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రమాద రహిత వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంవీఐ లావణ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ పలు సూచనలు చేశారు. ఆర్ఎం రాజశేఖర్ మాట్లాడుతూ రీజియన్ పరిధిలో ప్రమాదాలు జరుగకుండా ఎప్పటికప్పుడు డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవీఎం మాధవి, శివశంకర్ సిబ్బంది ఉన్నారు.

# బ్రాండెడ్ పేరుతో నకిలీ సరుకుల విక్రయం!

- నల్లగొండలో కాపీ రైట్స్ అధికారుల తనిఖీ

నీలగిరి, జూలై 24 : నల్లగొండ పట్టణంలోని పలు దుకాణాల్లో బుధవారం కాపీ రైట్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు బ్రాండెడ్ పేరుతో నాణ్యతా లేని విద్యుత్ వైర్లు అమ్ముతున్న నిర్వాహకులపై కాపీరైట్స్ ముంబై అధికారులు, వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. ప్రకాశం బజార్‌లోని హనుమాన్ ఎలక్ట్రికల్ దుకాణంలో నిర్వాహకులు గోల్డ్ మెడల్ కంపెనీ పేరు చెప్పి నాణ్యతాలేని కరెంటు వైర్లు అమ్ముతున్నట్లు అందిన సమాచారంతో సోదాలు చేసి దాదాపు రూ.22 లక్షల విలువైన 16 వైర్ల బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణంలోని షేర్‌బంగ్లాలో పద్మావతీ కిరాణం జనరల్ స్టోర్‌లో స్టీవ్‌వెల్ కంపెనీ పేరుతో నకిలీ అగర్‌బత్తులు దాదాపు 1.21 లక్షల విలువైన ఏడు బాక్స్‌లను స్వాధీనం చేసుకొని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అనంతరం వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యత లేని వస్తువులను ప్రజలకు హానీ కలిగించే వస్తువులను అమ్ముతున్న మదన్, శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐపీ ఇన్వెస్టిగేషన్ అధికారి ఇష్రార్, ఎస్ఐలు సందీప్‌రెడ్డి, శంకర్, కాపీరైట్ అధికారులు ఇక్బాల్ ఖద్రి, దినేశ్ శెట్టి, సంతోష్, దీపక్ ఉన్నారు.



కిరాణ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు